క్లుప్తంగా

రెడ్‌క్రాస్ హోమ్‌కు సైకో తరలింపు



సునీల్‌ను రెడ్ క్రాస్ ప్రతినిధులకు అప్పగిస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ ప్రధాన కార్యాలయం పార్కింగ్ స్థలంలో వీరంగం సృష్టించిన సైకోను త్రీటౌన్ పోలీసులు మంగళవారం రెడ్‌క్రాస్ హోమ్‌కు అప్పగించారు. ఈ సైకో పేరును తుమ్మల సునీల్‌గా గుర్తించినట్లు 17వ వార్డులోని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మురళీ తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న సునీల్ గతంలో సైతం చికిత్స చేయించుకున్నట్లు వెల్లడించారు. అయితే ఈయన సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సెల్లార్‌లో పార్కింగ్ చేసిన కార్లపై విచక్షణా రహితంగా దాడి చేసి అద్దాలు పగలగొట్టారు. దీంతో అక్కడి సెక్యూరిటీ సిబ్బంది ఆయనను బంధించి పోలీసులకు అప్పగించారు. ఈయన మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించిన పోలీసులు మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ హోమ్‌కు తరలించారు. మానసిక స్థితి మెరుగయ్యే వరకు ఇక్కడే ఉంచి చికిత్స అందించనున్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే



మాట్లాడుతున్న యాదగిరిరెడ్డి

సీతంపేట: గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ప్రపంచ టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టైలరింగ్ మెషీన్ సృష్టికర్త ఐజాక్ మెరిట్ సింగర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సి.హెచ్. యాదిగిరిరెడ్డి మాట్లాడుతూ రెడీమేడ్ రంగం విస్తరించడంతో దర్జీల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. టైలరింగ్ సొసైటీకి సామాజిక భవనం మంజూరు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సొసైటీలో 150 షాపులకు సంబంధించి వెయ్యి మంది సభ్యులు ఉన్నారని, తామందరినీ ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకారం అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సీహెచ్ వేణు, కోశాధికారి సీహెచ్ తిరుపతిరావు, సభ్యులు ఇషాక్ బాబా, అధిక సంఖ్యలో టైలర్లు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం నేడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం బుధవారం జరగనుంది. శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. స్వామివారి కల్యాణోత్సవం, చందనోత్సవంతో పాటు ఇతర పనులపై చర్చించనున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దేవస్థానం అధికారులు ఎలక్షన్ కమిషన్‌ను సంప్రదించారు. ఈ మేరకు చీఫ్ ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సమావేశం నిర్వహణకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు.

చోరీ కేసు ఛేదన

సింహాచలం: నగరంలో జరిగిన శుభకార్యానికి వచ్చిన వృద్ధ దంపతుల బ్యాగ్ గా దొంగలించిన మహిళను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాలు ... సికింద్రాబాద్ నుంచి జయంతి విజయలక్ష్మి, అచ్యుతరావు దంపతులు ఓ శుభకార్యం నిమిత్తం సోమవారం రాత్రి 7గంటల సమయంలో విశాఖపట్నం వచ్చారు. పెందుర్తి దరి పురుషోత్తపురం వెళ్లేందుకు అక్కడ ఆటో ఎక్కి బ్యాగ్‌ను ఆటో వెనుక భాగంలో పెట్టారు. పురుషోత్తపురం చేరుకున్న తర్వాత ఆటో వెనుక ఉన్న బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. అందులో ఎనిమిది తులాల బంగారం, కొత్త వస్త్రాలు ఉన్నాయి. వెంటనే పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రైల్వేస్టేషన్ నుంచి పెందుర్తి వరకు ఉన్న పలు సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. పాత రికార్డుల ఆధారంగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఒక మహిళ బ్యాగ్ దొంగిలించినట్టు గుర్తించారు. ఆమెను పట్టుకుని ఎనిమిది తులాల బంగారం, కొత్త దుస్తులు రికవరీ చేశారు.

అమ్మో.. మధురవాడ జంక్షన్

- బెంబేలెత్తుతున్న స్థానికులు, విద్యార్థులు
- హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్



ప్రమాదకర స్థితిలో రోడ్డు దాటుతున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు

మధురవాడ: నగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మధురవాడ ఒకటి. ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడే వారపు సంత, డైలీ మార్కెట్, 4 వేల మంది విద్యార్థులు, 100 మంది సిబ్బంది ఉన్న చంద్రంపాలెం హైస్కూల్ ఉన్నాయి. వాటితోపాటు జీవీఎంసీ జోన్ – 1 కార్యాలయం, ఆర్‌జేడీ విద్యాశాఖ, ఆయుష్ కార్యాలయాలు, ఇతర ఆస్పత్రులు, విశాఖ జోన్ – 3 విద్యుత్ శాఖ కార్యాలయం, హాస్టళ్లు, దేవాలయాలతో మరిన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసులు ఇక్కడే ఉన్నాయి. దీంతో రోజూ వేలాది మంది జాతీయ రహదారిని ఇటు నుంచి అటు... అటు నుంచి ఇటు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో హైవేపై వేగంగా దూసుకొచ్చే వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఇక్కడ రోడ్డు దాటడం పెద్ద పరీక్షలా మారింది.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే పరిష్కారం

వేలాది మంది విద్యార్థులు, ప్రజల భద్రత దృష్ట్యా ఇక్కడి జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంవత్సరాలుగా కోరుతున్నారు. ఇక్కడ రోడ్డు దాటలేకే పిల్లలను పాఠశాలలకు, హాస్టళ్లకు పంపించడానికి చాలా మంది తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. గతంలో పోలీసు, ఇతర అధికారుల బృందం ట్రాఫిక్, ఇతర సమస్యలపై అధ్యయనం చేశారు. ఆ సమయంలో ఇక్కడ రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారిందని అందరూ ముక్తకంఠంతో చెప్పారు. దీంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. తర్వాత ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడం ద్వారా ప్రమాదాలు నివారించడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ లేక ఇబ్బందులు



ఐసీడీఎస్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ ప్రాంతంలో అంగన్‌వాడీ లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న భానోజీ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లలేక సతమతమవుతున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరం అవుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే చాలాసార్లు ఐసీడీఎస్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రామ్‌నగర్‌లోని సేవ సదరన్ స్కూల్‌లో జీఎస్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఉండేది. ఆ కేంద్రంలో రామ్‌నగర్ వాసులు కూడా లబ్ధిపొందేవారు. అయితే గతేడాది స్కూల్ యాజమాన్యం మార్పుతో అక్కడ అంగన్‌వాడీ కేంద్రాన్ని జీఎస్‌ఎం కాలనీకి తరలించారు. దీంతో రామ్‌నగర్ ప్రజలకు సమస్య మొదలైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రామ్‌నగర్‌లో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరికి వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కూడా మంగళవారం వినతిపత్రం అందజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులపై కఠిన చర్యలు



ఏయూ గేట్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థి, పరిశోధక, అధ్యాపక సంఘాల నాయకులు

- ఏయూ విద్యార్థి, పరిశోధక, అధ్యాపక సంఘాల డిమాండ్
- వర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట కొవ్వొత్తుల ర్యాలీ

ఎంవీపీ కాలనీ: వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ విద్యార్థిని ప్రీతి మరణానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి, పరిశోధక, అధ్యాపక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఏయూ ప్రధాన ద్వారం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రీతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏయూ ఆచార్యుడు టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ప్రీతి మరణం వెనుక ఉన్న అనేక అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం తెలంగాణ ప్రభుత్వంపై ఉందన్నారు. పీజీ విద్యార్థిని అయిన గిరిజన యువతిపై కళాశాలలో జరిగిన వేధింపులు దారుణమన్నారు. నిజాలను బయటపెట్టకుండా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నట్లు తెలిపారు. పరిశోధక విద్యార్థి సంఘం నాయకులు బి.మోహన్, కల్యాణ్‌లు మాట్లాడుతూ ప్రీతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య అర్జున్, ఆచార్య జర్రా అప్పారావు, విద్యార్థి నాయకులు శాంతారావు, సునీల్, రాజ్‌కుమార్, సాంబశివరావు, ఇసుకపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు గెలుపే లక్ష్యం



పదో వార్డులో పట్టభద్రుడికి కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని



15వ వార్డులో ప్రచారం చేస్తున్న అప్పారి గిరిబాబు



17వ వార్డులో కర పత్రం అందిస్తున్న గేదెల నాగరాజు

ఆరిలోవ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల కోరారు. ఈ మేరకు ఆరిలోవలో మంగళవారం పలు వార్డుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 10వ వార్డు ఇందిరానగర్‌లో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, స్థానిక నాయకులతో కలసి ఆమె పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు.

- జీవీఎంసీ 13 వార్డు ఆపరేషన్ కాలనీలో కార్పొరేటర్ కెల్ల సునీత వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.
- సీపీఎం, టీడీపీ, బీజేపీ నాయకులు కూడా తమ పార్టీ మద్దతు అభ్యర్థుల విజయం కోసం ఆరిలోవలో ప్రచారం చేశారు.
- **మద్దిలపాలెం:** ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల 16వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి తమ తొలి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.
- సుధాకర్‌కు మద్దతుగా 23వ వార్డు మద్దిలపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డి, పార్టీ నాయకులు ప్రచారం చేశారు.
- సుధాకర్ గెలుపే లక్ష్యంగా 15వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారి గిరిబాబు, తదితరులు ఏపీఎస్ఈబీ కాలనీలో ప్రచారం చేశారు. పట్టభద్రులైన ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించారు.
- **ఎంవీపీ కాలనీ:** జీవీఎంసీ 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.
- సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్‌లో ఉదయం వచ్చిన వాకర్స్‌కు రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ తదితరులు కరపత్రాలు అందజేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో కూడా ప్రచారం చేశారు.

పరిశోధనాత్మకతతో కొత్త ఆలోచనలు

- విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన అవసరం
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



ఏయూలో ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఎంవీపీ కాలనీ: సైన్స్ విద్యార్థులు నేర్చుకోవాలనే తపన తప్పనిసరిగా పెంపొందించుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ డే వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెషన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో వీసీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సైన్స్ విద్యార్థులు ప్రతి అంశాన్ని సైంటిఫిక్ కోణంలో చూడాలన్నారు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని, ప్రతి వస్తువునూ పరిశోధనాత్మక కోణంలో చూసినప్పుడే విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, కొత్త ప్రశ్నలు రేకెత్తుతాయని చెప్పారు. వాటి పరిష్కారం దిశగా విద్యార్థులు చేసే కృషి సరికొత్త ఆవిష్కరణలకు నాంది అవుతుందన్నారు. వర్సిటీ వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు దిశగా సాగాలన్నారు. వర్సిటీలో చదివిన ప్రతి విద్యార్థి ఉద్యోగంతో బయటకు వెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. వారంలో రెండు సార్లు విద్యార్థులు తమ విభాగ పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. గౌరవ అతిథి అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏయూ పూర్వ విద్యార్థి కేవీవీ రాజు మాట్లాడుతూ భవిష్యత్‌ను ప్రభావితం చేసే ఇన్నోవేషన్‌పై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. అనంతరం సైన్స్ కళాశాలలోని వివిధ విభాగాలలో ఉత్తమ విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య సమత, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్ బాబు, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరావు, పలువురు డీన్స్, డైరెక్టర్స్, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ డే ర్యాలీ

జాతీయ సైన్స్ డే సందర్భంగా ఉదయం నిర్వహించిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. వర్సిటీ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి జెండా ఊపి ప్రారంభించిన ఈ ర్యాలీ ఏయూ పరిపాలన విభాగం నుంచి ఫిజిక్స్ విభాగం వరకు చేపట్టారు. 2 వేల మందికి పైగా సైన్స్ కళాశాల విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రదర్శనలతో సృజనాత్మకత

మద్దిలపాలెం: పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కేఆర్‌ఎం కాలనీలోని శివ శంకర్ విద్యా నికేతన్‌లో ఏర్పాటు చేసిన సైన్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులను వంశీకృష్ణతో పాటు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, గుడ్ల సత్యారెడ్డి అభినందించారు.



సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

ఎంఎల్‌బీటీ స్కూల్‌లో..

ఎంవీపీ కాలనీ: ఈస్ట్ పాయింట్ కాలనీ గాయత్రి విద్యాపరిషత్ ఎంఎల్‌బీటీ స్కూల్‌లో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నీటి పొదుపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వాణిజ్య పంటలు, సోలార్, కాలుష్య నియంత్రణ వంటి అంశాల్లో విద్యార్థులు 30కి పైగా నమోనా ఆవిష్కరణలతో అబ్బురపరిచారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు, టెక్నికల్ ఆడిటర్ మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ప్రతినిధి ఎన్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్బీటీ స్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు

బీవీకేలో సత్తిపండు సందడి



బీవీకే పాఠశాలలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జబర్దస్త్ కమెడియన్ సత్యనారాయణ

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డే వేడుకల్లో బైజూస్ ట్యాబ్స్ జిల్లా నోడల్ అధికారి పి.వి.ఎన్.సత్యనారాయణ(జబర్దస్త్ కమెడియన్ సత్తిపండు) సందడి చేశారు. ఆయనతో ఫొటోలు తీసుకునేందుకు పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచారు. ఈ పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు గుండె పనిచేసే విధానం, ఏసీలు, కూలర్లు తదితర పరికరాలు పనిచేసే విధానం, వాతావరణ కాలుష్యం తదితర ప్రాజెక్టులు ప్రదర్శించారు. వీటిని సత్యనారాయణ ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత శాస్త్రీయ దృక్పథాన్ని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీవీకే పాఠశాల కరెస్పాండెంట్ నరసింగరావు నాయుడు, ప్రధానోపాధ్యాయిని కె.వి.డి.మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

ఐఐపీఈతో ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ఒప్పందం



పత్రాలు మార్చుకుంటున్న ఐఐపీఈ డైరెక్టర్, ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ డైరెక్టర్ రాధికా చౌదరి

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) క్యాంపస్‌లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఐఐపీఈ విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితిలో సైన్స్ ప్రాధాన్యం, అవసరం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్ విధి విధానాలు, సాధించిన విజయాల గురించి ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రతినిధులకు వివరించారు. అనంతరం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఫ్రైయర్ ఎనర్జీ సర్వీసెస్ డైరెక్టర్ రాధికా చౌదరి, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన ఒప్పంద పత్రాలు అందజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ డీన్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద్‌కు జాతీయ అవార్డు



కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన డాక్టర్ మామిడూరి వరప్రసాద్‌కు మధ్యప్రదేశ్‌లోని సోషియల్ పాయింట్ ఫౌండేషన్ చైర్మన్ అభిషేక్ చేతుల మీదుగా 2022–23 సేవలకు గుర్తింపుగా 'భారత్ భూషణ్' అవార్డు అందుకున్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు అందుకున్నట్టు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు.

అటు నేహా.. ఇటు అనసూయ



కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న అనసూయ

సబ్బవరం: ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది..సాయంత్రం సెలబ్రిటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా..బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండీ సింగర్ మోహన భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవానిపాలెంవాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన గుర్రపు పందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ మందుగుండు పోటీలు మిరమిట్లు గొలిపాయి. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంతో పాటు రాకెట్ రాఘవ టీమ్‌తో పాటు పలువురు వెండి, బుల్లితెర నటులు సందడి చేశారు.

కళాకారులకు పురస్కారాలు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ సంయుక్తంగా స్థానిక పౌరగ్రంథాలయంలో నందమూరి శతజయంతి వేడుకల నెలవారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ నెల కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర కళాకారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. డీటీఎస్ ఆనంద మిమిక్రీ, చందు జాంగ్లింగ్ షో, శ్రీనివాస్ జానపద గీతాలు, మల్లికా, రామారావు, భాస్కర్లచే కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను మెప్పించాయి. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అతిథులుగా విచ్చేసిన సామాజిక విశ్లేషకులు సన్‌మూర్తి, శంఖారావం సంస్థ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఎన్టీఆర్ పురస్కారాలతో సత్కరించారు. డాక్టర్ కందుకూరి విజయమోహనరావు, నమ్మి అప్పలరాజుయాదవ్, దొరబాబు, రామకృష్ణ, మల్ల అప్పారావు, టి.ఎస్.ఆనంద్ వరప్రసాద్, కరకవలస కృష్ణమూర్తి, జి.ఎస్.ఎన్.మూర్తి, రాము, కోరాడ నారాయణరావు, జగదీష్ ఎన్టీఆర్ పురస్కారాలు అందుకున్నారు.